# 25శాతం రిబెట్‌కు మూడు రోజులే: కలెక్టర్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, మార్చి 27 ప్రభాతవార్త :** ఎల్ఆర్ఎస్ స్కీం క్రింద ప్లాట్ల క్రమబద్ధీకరణ కొరకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల కొరకు ప్రభుత్వం కల్పించిన 25 శాతం రిబేట్ ఈనెల 31 వరకు అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్ ప్లాట్ల క్రమబద్ధీకరణకు మరో మూడు రోజుల గడువు మాత్రమె ఉన్నందున జిల్లాలోని అన్ని మున్సిపల్ గ్రామ పంచాయతీలలో ఫీజును చెల్లించి తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గడువు ముగిసిన తర్వాత 25 శాతం రిబేటు వర్తించదని తెలిపారు. ఈ అవకాశం కొద్ది రోజులే ఉన్నందున దీనిని సద్వినియోగం చేసుకోనాలన్నారు. చెల్లింపులు చేసిన వారికి రెండు లేదా మూడు రోజులలో అనుమతులు మంజూరు చేయబడతాయని తెలియజేశారు.

## ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కేసులు నమోదు : జిల్లా ఎస్పి



అమరచింత నాగులకుంట లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైన సందర్భంగా పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**అమరచింత, మార్చి 27 ప్రభాతవార్త :** ప్రభుత్వ భూములను అక్రమంగా ఎవరైనా కబ్జా చేస్తే వారిపై కేసులు నమోదు చేయాలని వనపర్తి జిల్లా ఎస్పీ, రావుల గిరిధర్ పోలీసులకు ఆదేశించారు. గురువారం అమరచింతలోని నాగులకుంటలో 13 ఎకరాల భూమిని కొందరు కబ్జా చేశారని ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆయన అన్నారు. అలాగే జూరాల ప్రాజెక్టు దగ్గర పోలీస్ అవుట్ చెక్ పోస్ట్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అలాగే వనపర్తి జిల్లాలోని పెద్దమందడిలో దొరికిన మొసలి ని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆధ్వర్యంలో జూరాల ప్రాజెక్టు ఎన్టీఆర్ కాలువలో మొసలిని వదిలారు. జిల్లా ఎస్పీ వెంట ఆత్మకూరు సిఐ, శివకుమార్, అమరచింత ఎస్సై, సురేష్, ఏఈ, ఆంజనేయులు, వర్క్ ఇన్స్పెక్టర్, డిసి దామోదర్ తదితరులు ఉన్నారు.

## మిర్చి రైతులను ఆదుకోవాలి

**కనీస మద్దతు ధర రూ.20 వేలు ప్రకటించాలి**

**అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే**



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**అలంపూర్, మార్చి 27 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన అలంపూర్ నియోజకవర్గంలో సారవంతమైన నేలలు ఉండడం చేత ఈ ప్రాంత రైతులు అధిక మొత్తంలో మిర్చి పంటను సాగు చేస్తున్నారని అట్టి మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేక రైతన్నలు తీవ్ర -మిగతా3లో..

## నియోజకవర్గం అభివృద్ధి కృషి చేస్తా : ఎమ్మెల్యే మేఘా రెడ్డి



అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


**వనపర్తి ప్రతినిధి మార్చి 27 ప్రభాతవార్త:** వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో వేరుశనగ అధికంగా పండుతుందని, పెద్దమందడి మండలం వీరాయపల్లిలోని వేరుశనగ పరిశోధన కేంద్రానికి స్థలం కేటాయించబడి ఉందని, పరిశోధన కేంద్ర నిర్మాణాన్ని వెంటనే పరిశించాలని ఆయన సభా దృష్టికి తీసుకెళ్లారు. రేవల్లి, ఏదుల, శ్రీరంగాపురం మండలాలలోని, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లు అద్దె భవనంలో కొనసాగుతున్నాయని, ఈ కార్యాలయాలకు సొంత భవనాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా విద్యాపర్తిగా పేరొందిన వనపర్తి నియోజకవర్గంలోని ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలో ఒక డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# విందుతో పాటు.. మందు...!



- బార్లుగా మారిన హోటళ్లు...
- అన్ని రకాల బ్రాండ్లు అందుబాటులో...?
- అర్ధరాత్రి దాకా అమ్మకాలు...!!
- బైండోవర్లకు భయపడని హోటల్ నిర్వాహకులు!!
- జరిమానాలు ఎన్నైనా వేయండి అదరం బెదరం!!
- తలలు పట్టుకుంటున్న సంబంధిత అధికారులు
- కఠిన చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

**నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు..**



జిల్లాలోని భోజనం హోటళ్లలో మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవు ఇదివరకే పలు హోటల్ యజమానులపై బైండోవర్ చేశాము. హోటళ్లలో మద్యం విక్రయిస్తున్నారని మా దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తాం.

శ్రీనివాస్,
ఎక్సైజ్ సూపరింటెండెంట్, వనపర్తి జిల్లా

**వనపర్తి క్రైమ్, మార్చి 27 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో ఓ మోస్తరు హోటళ్లు మద్యపాన ప్రియులకు అడ్డాలుగా మారాయి. ప్రజలను, యువతను మద్యానికి అలవాటు చేసే విధంగా అన్ని రకాల బ్రాండ్లు అందుబాటులో ఉంచుతూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా హోటళ్లను ఏర్పాటు చేసుకొని జిల్లా, పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో పాటు రహదారుల వెంబడి విందు సదుపాయాలను కల్పిస్తూ ఏర్పాటు చేసుకున్న హోటళ్ల తీరు మందు బాబులకు నిలయాలుగా మారిపోతున్నాయి. అనుమతి పొందిన బార్లు, వైన్స్ లో దొరికే మద్యం కన్నా కొంత మోతాదులో తక్కువ రేటుకు దొరుకుతుండడంతో ప్రతి ఒక్కరు హోటల్లో మద్యం సేవించేందుకు మొగ్గు చూపుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చేందుకు మద్యం అమ్మకాలపై ప్రత్యేక దృష్టిని ఉంచడంతో ప్రతి జిల్లాలో కూడా అధికారులు బెల్టు షాపులను అదుపు చేయలేకపోతున్నారు. చిన్నపాటి గదులలో ఏర్పాటు చేసుకున్న హోటళ్లలో విందుతోపాటు రకరకాల బ్రాండ్లను అందుబాటులో ఉంచుతూ బార్ల నిర్వహణ లాగే వ్యవహరిస్తున్నాయి. అన్ని రకాల అనుమతులను తీసుకొని నిర్వహిస్తున్న బార్లు వైన్సులు సమయపాలన పాటిస్తుండగా విందు భోజనానికి ఏర్పాటు చేసుకొని మందును అందిస్తున్న హోటళ్లు మాత్రం అర్ధరాత్రి దాకా కొనసాగిస్తున్నారు. కొన్ని కొన్ని హోటళ్లలో, బార్లలో కూడా దొరకని మద్యం అందుబాటులో ఉంచుతూ మద్యం ప్రియులను ఆకర్షిస్తున్నాయి. ఇటువంటి హోటళ్ల కారణంగా అర్ధరాత్రి దాకా మద్యం సేవించిన మందు ప్రియులు రోడ్లపై ప్రమాదాలకు గురవుతుండడంతో పాటు అల్లర్లకు పాల్పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లా మద్యపాన నిషేధ అధికారులు పలు హోటళ్లపై తనిఖీలు నిర్వహించి జరిమానాలతో పాటు బైండోవర్ విధించారు. అయినప్పటికీ జరిమానాలకు జంకని హోటల్ యజమానులు తీరు మార్చుకోకుండా మద్యం అమ్మకాలకు ప్రాముఖ్యత కల్పిస్తున్నారు. జిల్లా మద్యపాన నిషేధ అధికారులు పలు హోటళ్లపై తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించినా, పలుమార్లు చర్యలు తీసుకున్నా మార్పు రాకపోవడంతో ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. నియమ నిబంధనలు పాటించకుండా భోజనం హోటల్‌లో మద్యం అమ్మకాలు చేస్తున్న హోటళ్లపై జరిమానాలు కాకుండా కేసులు నమోదుచేసి హోటళ్లను సీజ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆటోలో తరలిస్తున్న మద్యం

# విద్యార్థులలో సృజనాత్మకతను పెంచే కార్యక్రమాలు చేపట్టాలి



మాట్లాడుతున్నజిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

**నారాయణపేట టౌన్, మార్చి 27 ప్రభాతవార్త :** విద్యార్థులలో సృజనాత్మకతను పెంచే కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేయబడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నైపుణ్యాల ప్రదర్శన వేదిక విద్యా కదంబం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై, జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అమలు జరుగుతున్న మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ ను సందర్శించి, విద్యార్థులు చేస్తున్న వివిధ కృత్యాల్లో పాలుపంచుకొని, వారిని పలు రకాలుగా ప్రశ్నిస్తూ, విద్యార్థుల ద్వారా సమాధానాలు రాబట్టి, విద్యార్థులను అభినందించారు. జట్టుకృత్యాలలో విద్యార్థులతో మమేకమై ఈ కృత్యాల ద్వారా ఆనందం పొందుతున్నారా? అని అడగడంతో పాటు, మధ్యమధ్యలో పిల్లలను చదివే సామర్థ్యాన్ని పరీక్షించారు. ఆంగ్లమును అనర్గళంగా చదివే విద్యార్థులను చూసి ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చింతల్ దిన్నె పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన మౌఖిక గణితానికి ప్రత్యేకంగా అభినందించారు. ఏడాది పాటు నిర్వహించిన కార్యక్రమాలను ఈ విధంగా ఘనమైన ముగింపు కార్యక్రమం చేయడం బాగుందని, ఇదే స్ఫూర్తితో రానున్న విద్యా సంవత్సరం మరింత మెరుగ్గా పనిచేయాలన్నారు. విద్యాశాఖ పట్ల ప్రత్యేక దృష్టి ఉన్న కారణంగానే మన జిల్లాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధన సాగుతుందని, ఇలాంటి మరెన్నో వినూత్న కార్యక్రమలు జిల్లా విద్యాశాఖ నుంచి చేయాలని, అందుకోసం తన వంతు సహకారం అందిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో ఆంగ్ల నైపుణ్యాలు పెంపొందించుటకు ప్రవేశపెట్టిన యంగ్ ఆరేటర్స్ కార్యక్రమం ఆరంభంలో కొంత ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ, బాలల దినోత్సవం – మిగతా3లో..

# సువర్ణ అవకాశం

**31వరకు మాత్రమే**

**- ఓటిఎస్‌ను సద్వినియోగం చేసుకోండి**

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, స్పెషల్ ఆఫీసర్ శివేంద్ర ప్రతాప్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 27 ప్రభాతవార్త:** వన్ టైం సెటిల్మెంట్(ఓటిఎస్) స్కీమ్ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆస్తిపన్ను బకాయిలపై విధించిన వడ్డీపై 90శాతం రాయితీ పొందాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నగరపాలక సంస్థల స్పెషల్ ఆఫీసర్ శివేంద్ర ప్రతాప్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 202425 ఆర్థిక సంవత్సరంనకు చెందిన ఆస్తి పన్ను బకాయిల మొత్తాన్ని చెల్లిస్తే, ఆస్తి పన్నుపై 90 పేరుకుపోయిన బకాయి వడ్డీని మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని – మిగతా3లో..

**ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వందశాతం**

# విజయవంతం అయ్యేలా చర్యలు

**- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తిటౌన్ మార్చి 27 ప్రభాతవార్త:** మహిళా సాధికారత, మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ద్వారా అమలుచేస్తున్న పథకాలు జిల్లాలో వంద శాతం విజయవంతం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లాకలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. గురువారం ఉదయం సీఈఓ, సెర్ప్ దివ్య దేవరాజన్, పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్‌కుమార్ జిల్లాకలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో యుబిఐడిసదరం, భర్త/భార్య చనిపోయిన వారికి వృద్ధాప్యపెన్షన్ అమలు, శాశ్వతవలసలు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం, ఎస్.హెచ్‌జి గ్రూపులద్వారా పాఠశాలవిద్యార్థుల యూనిఫాం కుట్టడం, జిల్లాలో పెట్రోల్‌బంక్ ఏర్పాటు, ఆర్‌సెటిపనులు వేగవంతంచేయడం, ఎస్.హెచ్‌జి గ్రూపులకు రుణబీమా మరియు మరణబీమా సదుపాయం అమలు అనే అంశాలపై జిల్లా కలెక్టర్లతో చర్చించి తగు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షిస్తూ వనపర్తిజిల్లాలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్న అన్ని పథకాలు పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పి.డి., జడ్పి సి.ఈ.ఒ ను సూచించారు. వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ఐ.కే.పి సభ్యులకు అత్యధికంగా కొనుగోలు కేంద్రాలు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి మండలంలో ఒక గోదాం, రైస్ మిల్లు ఏర్పాటు చేసే విధంగా మహిళా సంఘాలకు ప్రోత్సహించాలని చెప్పారు. వృద్ధాప్య పింఛన్లు నిరుపేద కుటుంబంలోని 57 సంవత్సరాల వయసు దాటిన వారికి ఒకరికి వృద్ధాప్య పింఛను ఇవ్వడం జరుగుతుందనీ, వారికి భర్త గాని భార్య గాని చనిపోతే భర్త లేదా భార్యకు వృద్ధాప్య పింఛను బదలాయించాలని ఈప్రక్రియను వేగవంతంగాపూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామం, మండలం వారీగా చనిపోయిన వృద్ధాప్య పింఛను దారుల నివేదిక తెప్పించుకోవాలని సూచించారు. అదేవిధంగా మూడునెలల కంటే ఎక్కువకాలం పింఛను తీసుకోకుండా శాశ్వత వలస పోయిన వారి వివరాలు సేకరించాలని సూచించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ఈ పథకం కింద స్వయం సహాయక సంఘంలో ఉన్న సభ్యుల కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే రూ.20,000 లు ఆర్థికసహాయం అందించడం జరుగుతుందని, వనపర్తిజిల్లాలో ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. రుణభీమా, ప్రమాదభీమా ఈపథకం కింద స్వయం సహాయక సభ్యురాలు ప్రమాద వశాత్తూ మరణించిన లేక శాశ్వత అంగ వైకల్యం పొందిన రూ.10లక్షల భీమా అందించడం జరుగుతుందని, జిల్లాలో ఎవరైనా సభ్యురాలు ప్రమాద వశాస్తు మరణిస్తే వారికి భీమా సౌకర్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థగ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధికి అవసరమైన శిక్షణ ఇవ్వడానికి గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ద్వారా ఇది ప్రారంభించామని, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వం, స్పాన్సర్‌బ్యాంకుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసే ఈ సంస్థను త్వరగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ఆదేశించారు. గ్రామీణ యువతకు స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా వారిని వ్యవస్థాపకులుగా మార్చవచ్చున్నారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, పి.డి. గ్రామీణాభివృద్ధి శాఖ ఉమాదేవి, డి.పి.యం అరుణ, ఎల్.డి యం కౌశల్ కిషోర్ పాండే, డి.ఈ.ఒ మొహమ్మద్ గని తదితరులు పాల్గొన్నారు.

# సహాయక చర్యలు మరింత ముమ్మరం

**- టన్నెల్‌లోకి మరోసారి కడావర్ డాగ్స్ - ఎస్ఎల్‌బిసి ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి వెల్లడి**



సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బంది



సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 27, ప్రభాతవార్త:** ఎస్ ఎల్ బి సి, టన్నెల్ ప్రమాదం జరిగిన ప్రదేశంలో సహాయక చర్యలు వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి ని నియమించగా గురువారం ఉదయం 10 గంటలకు సహాయబృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు పలు సలహాలు, సూచనలు, అందజేశారుఈ సందర్భంగా శివశంకర్ లోతేటి మాట్లాడుతూ .... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సహాయక బృందాలు 34 రోజులుగా నిరంతరం సహాయక చర్యలో పాల్గొంటున్నట్లు, ప్రతిరోజు మూడు షిఫ్టులలో 600 మంది సిబ్బంది పాల్గొంటు సహాయక చర్యలు చేపడుతున్నట్లు, సహాయక బృందాల మధ్య పూర్తిస్థాయి సమన్వయంతో సహాయక చర్యలు వేగంగా కొనసాగుతున్నట్లు తెలియజేశారు. టన్నెల్ ప్రమాదం జరిగిన రోజు నుంచి నిరంతరా యంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, సహాయక చర్యల్లో భాగంగా సొరంగంలో ఉన్నటువంటి మట్టిని టీబీఎం భాగాలను ఊట నీటిని ఎప్పటికప్పుడు తొలగిస్తూ సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నట్లు, రెట్టింపు సహాయక బృందాల చే సహాయక చర్యలను చేపడుతున్నట్లు వివరించారు. టన్నెల్ లోపల సహాయక చర్యల ద్వారా వెలువడిన వ్యర్థ పదార్థాల ను ఎప్పటికప్పుడు లోకో ట్రైన్ ద్వారా బయటికి తరలిస్తున్నట్లు తెలిపారు. నిరంతరాయంగా వస్తున్న ఊట నీటిని అత్యధిక సామర్థం గల పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నట్లు వివరించారు. సహాయక చర్యలలో పాల్గొంటున్న సహాయక సిబ్బందికి కావలసిన ఆహారం, వసతి, ఆరోగ్యం తదితర సదుపాయాలను కల్పిస్తూ, వాటిపై నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నట్లు తెలిపారు. ప్రమాదం ప్రదేశం సమీపంలో టన్నెల్లో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు కేరళకు చెందిన ప్రత్యేక శిక్షణ పొందిన కడవర్ డాగ్స్ ను గురువారం ఉదయం 11 గంటలకు ఎస్ఎల్‌బిసి సొరంగంలోనికి పంపినట్లు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్మీ అధికారి వికాస్ సింగ్, మేజర్ డాక్టర్ విజయ్ కుమార్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, కల్వకుర్తి ఆర్డీవో శ్రీనివాసులు, ఎన్‌డిఆర్ఎఫ్, అధికారి అసిస్టెంట్ కమాండెంట్ కిరణ్ కుమార్, ఎస్‌డిఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారి ఎన్. చంద్ర, హైడ్రా అధికారులు జేపీ కంపెనీ ప్రతినిధులు ర్యాట్ హోల్ మైనర్స్ ప్రతినిధి ఫిరోజ్ ఖురేషి, కడవర్ డాగ్ ప్రతినిధి బృందం పాల్గొన్నారు .



చెక్కును అందజేస్తున్న దృశ్యం

**మనోజ్‌కుటుంబానికి రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా..**

నాగర్‌కర్నూల్‌జిల్లా దోమలపెంట వద్ద జరిగిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో మృతి చెందిన జయప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్ కంపెనీలో ప్రాజెక్ట్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అర్జున్ ప్రసాద్ కుమారుడు మనోజ్ కుమార్ మృతదేహాన్ని అతని స్వగ్రామానికి తరలించి, భార్య స్వర్ణలత కు అప్పగించినట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. మనోజ్ కుమార్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన రూ. 25లక్షల ఎక్స్ గ్రేషియాను వారి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు గురువారం కలెక్టర్ తెలియజేశారు.



## మహబూబ్‌నగర్‌లో
# ఐఐటీ ఏర్పాటు చేయండి

- పార్లమెంట్ జీరో అవర్‌లో కేంద్రాన్ని కోరిన ఎంపీ డీకే అరుణ
- పాలమూరు అభివృద్ధిపై ఎంపీ స్పెషల్ ఫోకస్
- కేంద్రం ద్వారా రావాల్సిన అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి
- తమ ప్రాంతం అభివృద్ధికి అడుగులు వేయాలని విజ్ఞప్తి



ప్రసంగిస్తున్న ఎంపీ డీకే అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 27, ప్రభాతవార్త:** పాలమూరు అభివృద్ధిపై ఎంపీ డీకే అరుణ ప్రత్యేక ఫోకస్ పెట్టారు. కేంద్రం ద్వారా రావాల్సిన అన్ని అంశాలపై ఆమె దృష్టి సారించి ఇప్పటికే పలు సందర్భాల్లో ఆ అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. గురువారం లోకసభలో పాలమూరుకు ఐఐటీ కావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తమ పార్లమెంట్ పరిధిలో అన్ని రకాల పరిశ్రమలు ఉన్నాయని, వాటిల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన వారు వందల మంది పనిచేస్తున్నారని వివరించారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో ట్రిబుల్ ఐటి ఏర్పాటు చేస్తే మహబూబ్ నగర్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. తమ బిడ్డలు పాలమూరు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇవ్వ గల్గుతామని అంతే కాదు.. మహబూబ్ నగర్ పార్లమెంట్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఐఐటీ ఏర్పాటు ఉద్దేశ్యం సభ్యులందరికీ తెలిసిందేనని, జాతీయస్థాయిలో విద్యార్థులు, ఉన్నతమైన స్థానాలు చేరేందుకు ఈ ఐఐటీలు ఎంతగానో ఉపకరిస్తాయని, జాతీయస్థాయిలో ఐటీ రంగంలో ఇన్నోవెటివ్స్ ఇంప్రూవర్మెంట్ చెందొచ్చని, ఐటీ రంగంలో ఉన్నతమైన లక్ష్యాలు సాధించొచ్చు కొత్త ఆలోచనలకు పునాది వేయొచ్చన్నారు. రూరల్ ఏరియాల్లోని ఔత్సాహికులకు, పోత్సాహంతోపాటు, ఎన్నో ఉపాధి అవకాశాలు కల్పించొచ్చని, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా సులువుగా సాధించే అవకాశం ఉందన్నారు. ట్రిబుల్ ఐటీ లేక పోవడం వల్ల మా పరిధిలో పరిశ్రమలు ఉన్నప్పటికీ.. వాటిల్లో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇవ్వలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్ లాంటి రూరల్ ఏరియస్ లో ఐఐటి ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రిబుల్ ఐటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# గోప్యతకు తావుండొద్దు


- పారదర్శంగా సర్వే చేసి రిపోర్ట్ ఇవ్వండి
- కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం
- జిల్లా స్థాయి మాన్యువల్ స్కావెంజింగ్ కమిటీ సమావేశం




మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి27, ప్రభాతవార్త:** మాన్యువల్ స్కావెంజర్స్‌పై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సూచనలు పాటిస్తూ పారదర్శకంగా, గోప్యతకు తావు లేకుండా సర్వే నిర్వహించి రిపోర్టు తయారు చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరం లో జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మాన్యువల్ స్కావెంజింగ్ పై సర్వే చేయుటకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూసుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం " నమస్తే స్కీమ్ " / " నమస్తే పోర్టల్" ద్వారా దేశం మొత్తం మాన్యువల్ స్కావెంజింగ్ ఇంకా ఎక్కడైన జరుగుతుందా అని తెలుసుకొనుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి లో సర్వే కమిటిలను ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ చైర్మన్ గా, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మెంబర్ సెక్రటరీగా, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, మున్సిపల్ కమిషనర్‌లు, జిల్లా పంచాయతీ అధికారి, రైల్వే స్టేషన్ మాస్టర్ సభ్యులుగా సిఐటియు స్టేట్ లీడర్ కమ్యూనిటీ ప్రతినిధి గా కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాన్యువల్ స్కావెంజింగ్ ఉందా తెలుసుకొనుటకు పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్ లు సర్వే నిర్వహించి నమస్తే స్కిమ్, నమస్తే పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు సర్వే చేయుట కొరకు ఎన్యూమరేటర్స్‌ను ఎంచుకొని వారికి సర్వే పైన అలాగే లీలీ తిశిశి పై శిక్షణ నిర్వహించాలని అన్నారు. ఈ సర్వేని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారుసమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, మెంబర్ సెక్రటరీ, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సుదర్శన్, సభ్యులు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి పార్థ సారథి, నాయకులు వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్‌లు మహవేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, భూత్పూర్, కమిషనర్ పాల్గొన్నారు.

# ఎల్‌ఆర్..ఎస్..




- ఎల్‌ఆర్‌ఎస్ పథకానికి విశేష స్పందన
- ఉమ్మడి జిల్లాలో 900డాక్యుమెంట్లకు పథకం వర్తింపు
- అత్యధికంగా వనపర్తి.. అత్యల్పం మక్తల్




**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 27, ప్రభాతవార్త :** ఎల్, ఆర్, ఎస్, పథకానికి జనాల నుంచి మంచి స్పందన లభిస్తున్నది. రాష్ట్రంలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ ముందంజలో ఉండనున్నట్లు అధికా రులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి ఎల్‌ఆర్‌ఎస్ పథకం 25 శాతం రాయితీతో, పౌరుల్లో భారీ స్పందన జిల్లా రిజిస్ట్రార్ రవీందర్ చెబుతున్నారు. గురువారం వరకు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా వ్యాప్తంగా సుమారు 900 డాక్యుమెంట్లు ఎల్‌ఆర్‌ఎస్ పథకం కింద రిజిస్ట్రేషన్ లు జరిగాయన్నారు. ప్రభుత్వం ఈనెల మార్చి 31 వరకు రాయితీ గడువు చెల్లుబాటు ఉండడంతో, అప్పటివరకు ఇంకా 300 పైగా రిజిస్ట్రేషన్లు అవ్వడానికి అవకాశం ఉందని తెలిపారు. మహబూబ్నగర్ 64, వనపర్తి 242, గద్వాల్ 110, కల్వకుర్తి 137, కొల్లాపూర్ 32, ఆత్మకూర్ 24, అచ్చంపేట 10, అలంపూర్ 20, జడ్చర్ల 105, నారాయణపేట 78, మక్తల్ లో 6, రిజిస్ట్రేషన్లు నమోదు అయ్యాయి అని తెలిపారు. ప్లాట్ల క్రమబద్ధీకరణతో పౌరులకు చట్టబద్ధత లభిస్తుందని భవిష్యత్తులో భూమికి సంబంధించిన వివాదాలను నివారించుకునేందుకు, అలాగే ప్లాట్ల అమ్మకాలు, కొనుగోలు, విషయంలో సులభతరం అవుతుందన్నారు. 2020 ఆగస్టు 26కు ముందు ఎల్‌ఆర్‌ఎస్ కోసం చేసుకున్న 25.67 లక్షల దరఖాస్తుల్లో 9.21 లక్షల దరఖాస్తుల పరిశీలన ఇప్పటికే పూర్తయింది. వీటిల్లో ఎలాంటి అభ్యంతరాలు లేని 1.74 లక్షల దరఖాస్తుదారులకు ఫీజుల చెల్లింపు కోసం పురపాలక శాఖ గతంలోనే సమాచారమిచ్చింది. వీరిలో 13,844 దరఖాస్తులకు సంబంధించి రూ.107.01 కోట్ల చెల్లింపులు కూడా గతంలోనే జరిగాయి. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులకు 200 మీటర్ల పరిధిలోపు ఉన్న వెంచర్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కుదరదని రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. నీటి వనరులను ఆనుకుని ఏర్పాటు చేసిన లే అవుట్లు, వ్యక్తిగత ప్లాట్ల రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్‌లకు సర్కార్ నుంచి స్పష్టమైన సూచనలు ఉండటంతో.. ఆ దరఖాస్తులను తిరస్కరించనున్నారు. అయితే.. వచ్చిన 25 లక్షల దరఖాస్తుల్లో ఇలాంటివి 4 లక్షల వరకు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మున్సిపల్ శాఖ అసిస్టెంట్ ప్లానర్ కరుణాకర్. మహబూబ్నగర్ మున్సిపల్ పరిధిలో క్రమబద్ధీకరణ కొరకు 31219 దరఖాస్తులు రాగా, ఈనెల మార్చి 21వ తేదీ వరకు 909 దరఖాస్తుల ద్వారా రూ3 కోట్ల83 లక్షలు రాబడి జరిగిందని, ఇందులో 588 ప్రొసీడింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. పౌరుల్లో అవగాహన పెరిగిందని మున్సిపల్ శాఖ అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి కరుణాకర్ తెలిపారు.

**25శాతం రాయితీ..**

2025 మార్చి 31 లోపు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న వారికి 25 రాయితీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించడానికి ఈ పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎల్‌ఆర్‌ఎస్ వెబ్ సైట్‌లో తమ దరఖాస్తు స్థితిని హెచ్‌ఎండీఏ వెబ్ సైట్ లో తెలుసుకోవచ్చు. లేకపోతే హెచ్‌ఎండీఏ కాల్ సెంటర్ కు కాల్ చేయవచ్చు. ఫీజు చెల్లించకుండా ప్లాట్ రెగ్యులరైజ్ చేసుకోవడానికి ప్రభుత్వం 25 డిస్కౌంట్ ఇస్తుంది. ఈ డిస్కౌంట్ 2025 మార్చి 31 వరకు అందుబాటులో ఉంది.

**ఎల్‌ఆర్‌ఎస్ అంటే..**

ఎల్‌ఆర్‌ఎస్ అంటే లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్. ఇది రాష్ట్రంలో అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం తీసుకువచ్చిన ఒక పథకం. ఎల్ ఆర్ ఎస్ గురించి మరింత సమాచారం: ఎందుకు ఈ పథకం?తెలంగాణ రాష్ట్రంలో చాలా అనధికార లేఅవుట్లు ఉన్నాయి, వాటిని క్రమబద్ధీకరించడానికి మరియు ప్రజలకు మంచి జీవనం అందించడానికి ఈ పథకాన్ని ప్రభుత్వం తీసుకు వచ్చింది. ఎవరు అర్హులు? అనధికార లేఅవుట్లలో ప్లాట్ ఉన్నవారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు.

**ఇవీ ప్రయోజనాలు..**

- అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించడం ద్వారా ప్లాట్ల యజమానులకు హక్కు లభించవచ్చు.
- ప్రభుత్వ సౌకర్యాలు (రోడ్లు, నీరు, విద్యుత్ మొదలైనవి) అందుబాటులోకి వస్తాయి.
- ప్రాథమిక సౌకర్యాలను అందించడం ద్వారా పౌరుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

# శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలి

- ట్రాఫిక్ సీఐ భగవంత్‌రెడ్డి
- డ్రైవర్లు, మెకానిక్‌లకు సూచనలు, హెచ్చరికలు

అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 27, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి ఆదేశాలమేరకు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ భగవంత్ రెడ్డి ద్విచక్ర వాహన మెకానిక్స్‌కు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. గురువారం మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మెకానిక్స్‌కి పలు సూచనలు జారీ చేశారు. శబ్ద కాలుష్య నియంత్రణ – అనుమతించని మార్పులు చేసిన సైలెన్సర్లను ఉపయోగించడం వల్ల తీవ్రంగా శబ్ద కాలుష్యం పెరుగుతోందని, దీన్ని అరికట్టేందుకు మెకానిక్స్‌కుమార్గనిర్దేశం చేశారు. ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్ నియంత్రణపై యువత ఎక్కువగా అధిక శబ్దం చేసే సైలెన్సర్లు అమర్చడం, ర్యాష్ డ్రైవింగ్ చేయడంవల్ల ప్రమాదాల ముప్పుపెరుగుతోందన్నారు. అదేవిధంగా రహదారి భద్రతపై అవగాహన – ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే వాటి ప్రభావం ఏమిటో మెకానిక్స్‌కు వివరించారు.

**మెకానిక్స్‌కు సూచనలు..**

- వాహనాలలో అధిక శబ్దం చేసే మార్పులు చేయకూడదు.
- అనధికారికంగా సైలెన్సర్లు మార్చే వారికి సహకరించరాదు.
- వాహనదారులను నిబంధనలు పాటించేలా ప్రేరేపించాలి.

**డ్రైవర్లకు హెచ్చరికలు..**

- అనుమతించని మార్పులు చేసిన వాహనాలను పట్టిస్తే కఠిన చర్యలు ఉంటాయి.
- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తారు.
- ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం
- ప్రాణాలను పోగొట్టుకునే ప్రమాదం ఉంటుంది. ఈ చర్యల ద్వారా ట్రాఫిక్ నియంత్రణ బలోపేతం అవుతుందని, రహదారుల భద్రత పెరుగుతుందని సీఐ వివరించారు. ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందన్నారు.

# అయోడిన్ లోపం పట్ల శ్రద్ధ వహించండి

**ఇన్స్టిట్యూట్ గ్లోబల్ డెవలప్మెంట్ అధికారి జి. ప్రసాద్**

**నారాయణపేట టౌన్, మార్చి 27 ప్రభాతవార్త:** అయోడిన్ లోపం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లేకపోతే థైరాయిడ్ సమస్యలు వచ్చే అవకాశం ఉంది అని ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ అధికారి ప్రసాద్ అన్నారు. గురువారం నారాయణ పేట్ దుల్ పేట, మోచి వాడ లలో ఆశీర్వాద స్మార్ట్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా పోషణ్ మేళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అయోడిన్ ఉన్న ఉప్పునే వాడాలి, అందరు సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి. పోషకాలు ఉన్న ఆహారాన్ని, విటమిను లభించే కూరగాయలు, పండ్లు, పాల పదార్థాలు తీసుకోవాలి అని అన్నారు. గర్భిణీ స్త్రీలు, కౌమార బాల బాలికలకు అయోడిన్ ఉపయోగాలను బలవద్దకరమైన ఆహారపు అలవాట్ల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వివిధ ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఐజిడి డిస్టిక్ ఆఫీసర్ ప్రసాద్, సభ్యులు కృష్ణ, నర్సింహా, శ్రీకాంత్ రెడ్డి, రాధ, కిరణ్, స్కూల్ టీచర్లు, ఏ న్ మ్, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలల పునః ప్రారంభం నాటికి యూనిఫాంలు సిద్ధంగా ఉండాలి




జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో సెర్ప్ కార్యక్రమాల పై కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి జిల్లాలోని డిపీఎం లు, ఎపిఎం లతో కలెక్టర్ సమీక్ష

**నారాయణపేట టౌన్, మార్చి 27 ప్రభాతవార్త :** వచ్చే విద్యా సంవత్సరం ( వేసవి సెలవుల తర్వాత) పాఠశాలల పునః ప్రారంభం నాటికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు స్కూల్ యూనిఫాంలు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో సెర్ప్ కార్యక్రమాల పై స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి జిల్లాలోని డిపీఎం లు, ఎపిఎం లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది విద్యార్థులకు యూనిఫాంల పంపిణీలో జరిగిన పొరపాట్లు, లోటు పాట్లను ఈ సారి అధిగమించి ప్రతీ విద్యార్థికి రెండు జతల యూనిఫామ్ లను పాఠశాలలు తెరిచే లోపు సిద్ధం చేసి ఉంచాలన్నారు. మే నెల 25 లోపు అన్ని మండలాలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కొలతలతో కూడిన యూనిఫామ్ లు కుట్టే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థిని విద్యార్థుల స్మాల్, మీడియం, లార్జ్ సైజ్ కొలతలు తీసుకునే ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని ఆమె అడిగి తెలుసుకున్నారు. మండలాల వారీగా పాఠశాలలు, తరగతుల వారీగా విద్యార్థుల వివరాలను సిద్ధం చేసి మహిళా సమాఖ్య సభ్యులకు పంపించాలని విద్యాశాఖ అధికారులకు ఆమె సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో గతేడాది మాదిరిగా యూనిఫామ్ ల పంపిణీలో జాప్యం జరగరాదని చెప్పారు. ఇంకా 45 రోజుల సమయం ఉందని, సీరియస్ గా తీసుకుని ఇప్పటి నుంచే యూనిఫామ్ లు కుట్టడం మొదలు పెడితే సరిగ్గా మూడు వారాల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థుల కు యూనిఫామ్ లు తయారు అవుతాయని ఆమె తెలిపారు. సమీక్షలో సెర్ఫ్ కార్యక్రమాల టార్గెట్, అచీవ్ మెంట్ గురించి మండలాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన టార్గెట్ల ను గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మొగులప్ప, డీఈఓ గోవిందరాజులు, అడిషనల్ డి ఆర్ డి ఓ అంజయ్య, జిల్లాలోని డిపిఎం లు, ఏపీఎంలు పాల్గొన్నారు.

# సర్పంచులను అరెస్టు చేయడం సిగ్గుచేటు

- అభివృద్ధి పనులు చేసి అప్పుల పాలయ్యాం..
- ప్రకటనలకు రూ.200కోట్ల ప్రజాధనం దుర్వినియోగం
- సర్పంచుల బిల్లులు ఎందుకు ఇవ్వరు
- సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్

**జడ్చర్ల, మార్చి 27, ప్రభాతవార్త :** అప్పు సొప్పు చేసి ఊరిని బాగు చేసిన సర్పంచులకు బిల్లులు ఇవ్వకుండా అడుగడునా ప్రతి రోజు అరెస్టులు చేసి అవమానించడం ఇదెక్కడి న్యాయమని రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ ధ్వజమెత్తారు. గురువారం సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని చేపడుతున్న శాంతియుత నిరసన కార్యక్రమాలలో భాగంగా జడ్చర్లలో సర్పంచులను ముందస్తు అరెస్ట్ చేయడం దారుణమని ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేయడమే అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదేనా మీరు జబ్బులు చరచుకుంటూ చెప్పుకొనే ప్రజాపాలన అని, ప్రజల శ్రమ రక్తం పన్నుల రూపం లో కట్టించుకొని వాటిని అధికారికంగా ఓట్లు కొనుటకు మీ ఇష్టం వచ్చిన దగ్గర పథకాలు అమలు చేసి మిగతావారికి మొండి చేయి చూపడం ముమ్మాటికీ రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలని తుంగలో తొక్కడమే అని విరుచుకుపడ్డారు. గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన సర్పంచుల బిల్లులు ఆపేయడం ఫెడరల్ స్ఫూర్తికే విరుద్ధమని, రాష్ట్రానికీ నిధులకొరకు వారానికోసారి ఢిల్లీ వెళ్తున్న మీరు ..అదే స్ఫూర్తితో సర్పంచుల పెండింగ్ బిల్లుల గురించి గత పదహారు నెలలుగా చెప్పులరిగేలా తిరుగుతున్న తెలంగాణ మొత్తం 12769 సర్పంచుల బిల్లులను ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. మీకొక నీతి సర్పంచులకో నీతియా అని దుయ్యబట్టారు. కొడంగల్ కి వేల కోట్లు కేటాయించారు, కానీ రాష్ట్ర వ్యాప్తముగా ఉన్న 12769 సర్పంచులకు ఎందుకు అన్యాయం చేస్తున్నారని అడిగారు. గత పదహారు నెలలుగా లక్షన్నర కోట్ల అప్పుచేసినారు కానీ రాష్ట్ర సర్పంచుల బిల్లులు ఆపేయడం మాత్రం ఎంతవరకు సమంజసమని అడిగారు. ప్రైవేట్ కాంట్రాక్టర్ ల బిల్లులు నలభై వేల కోట్లు చెల్లించిన మీరు సర్పంచుల 1300 కోట్ల పెండింగ్ బిల్లులు ఆపడం మాత్రం సిగ్గుచేటని అన్నారు.

అందాల పోటీలకు వందల కోట్లు ఖర్చు చేస్తున్నారు, కానీ అభివృద్ధి పనులు చేసిన సర్పంచులకు బిల్లులు ఇవ్వడానికి మనసు రావట్లేదా మీకు అని ప్రభుత్వాన్ని అడిగారు. యాడ్స్ ప్రకటనలు కి పదహారు నెలల్లో రెండు వందల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేసిన మీకు సర్పంచుల బిల్లులు ఇవ్వడానికి ఎందుకు నిరాకరిస్తున్నారు అని ప్రశ్నించారు. వెంటనే మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. నేడు జడ్చర్ల పోలీసులు జడ్చర్ల మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్ మరియు కార్యదర్శి రవీందర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

## ఉప కులపతికి జూడా నేతల అభినందనలు



వీసీకి బొకే అందజేస్తున్న జుడా నేతలు

**మహబూబ్‌నగర్, మార్చి 27, ప్రభాతవార్త:** కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పి.వి.నంద కుమార్‌రెడ్డిని తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం (టిజూడా) రాష్ట్ర చైర్మన్ డాక్టర్ శ్రీనాథ్ , కాకతీయ మెడికల్ కాలేజ్ ( కెయంసి) జూడా ఉపాధ్యక్షులు అశ్విని నవదీప్‌లు కలిసి అభినందనలు తెలిపారు. ఈమేరకు గురువారం వరంగల్ లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయంలోని నూతంగా ఉప కులపతిగా నియమితులైన డాక్టర్ పి.వి.నంద కుమార్ రెడ్డి ని జూనియర్ డాక్టర్ల సంఘం నేతలు డాక్టర్ శ్రీనాథ్, అశ్విని నవదీప్ లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి, పుష్ప గుచ్ఛ అందజేసి అభినందనలు తెలిపారు.

## పండుగలు ప్రజల్లో సోదరభావాన్ని పెంపొందిస్తాయి

**భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్ రెడ్డి**



ముస్లిం సోదరులకు పండ్లను తినిపిస్తున్న

**నారాయణపేట టౌన్, మార్చి 27 ప్రభాతవార్త :** పండుగలు అన్ని వర్గాల ప్రజల్లో సోదరభావాన్ని నింపుతాయని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులో భాగంగా నారాయణపేట జామా మసీదు వద్ద గురువారం సాయంత్రం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్ రెడ్డి హాజరై ముస్లిం సోదరులకు పండ్లను తినిపించి ముందస్తుగా ఈద్ ముబారక్ చెప్పారు. అంతకు ముందు నిర్వాహకులు రాజ్ కుమార్ రెడ్డి తదితరులను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పండుగలను అన్నివర్గాల ప్రజలు కలిసిమెలిసి జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మహ్మద్ తహి చాంద్, అమీరుద్దీన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, ముస్లిం సోదరులు మహ్మద్ షాబుద్దీన్, షరీఫ్ ఖురేషి, సయ్యద్ షా గయాసుద్దీన్ ఖాద్రి, సయ్యద్ షా మోసిన్, అబ్దుల్ అజీజ్, మహ్మద్ యూసుఫ్ చాంద్, మహ్మద్ అఖిల్ చాంద్, మహ్మద్ గౌసి తాజ్, మహ్మద్ ఉస్మాన్, రహీం షేక్, ఫౌండేషన్ సభ్యులు మధుసూదన్ రెడ్డి, హన్మంత్, వై.సంతోష్, శివరాజ్, నర్సింహులు, ఎం.సంతోష్, అశోక్ బసుదే, అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.